# మనసు విరిగితే...

తెన్నేటి సుధ

నీరజ ఉలిక్కిపడి చూసింది భర్త వైపు. ఆ ఉలికిపాటు క్రమంగా పెనుతుఫానుగా మారింది. అసలతనంటున్న దేమిటో, తన చెవులు వినేది నిజమో అబద్ధమో అర్థం కాలేదామెకు.

'అతన్తో రోజూ సరసాలాడుతున్నాదన్నమాట! సిగ్గులేదూ!' ఇదిగో ఈ మాటలే నీరజలో తుఫాను రేపినవి.

అయితే నీరజ పాతికేళ్ళపడుచూకాదు. ఆమె పతిదేవుడు రావు వయసులో ఉన్న యువకుడూ కాదు. వాళ్ళ సంసారానికే పాతికేళ్ళు. ఇరవైమూడు, ఇరవై ఒకటి వయసున్న ఇద్దరు మగపిల్లలు...

అందుకే ఈ విపరీతానికి అదిరి పడింది. ఆపిచ్చి ఇల్లాలు.

"మాట్లాడవేం?'? సింహంలా గర్జించాడు రావు.

'సమాధానం చెప్పగల ప్రశ్న వేశారా మీరు?' ఈ మాటలు అందామనకుంది నీరజ. కానీ గొంతు పెగల్లేదు. గొంతుకేదో పెద్ద బండరాయి అడ్డ పడింది.

ఉప్పెనలా కోపం రాబోతోంది. కానీ నీరజ సగటు ఆడది. ఆమె మొహంలో ఎన్నిరంగుల్లు మారినా మనసులో ఎన్ని భావాలు చెలరేగినా కళ్ళల్లోంచి కన్నీరు ఉబికివచ్చింది.

ఎట్లాగో గొంతు పెగల్చుకుని అతి ప్రయత్నం మీద అంది "మీరనేదేమిటో నాకు అర్థం కాలేదు..."

"అర్థం కాక పోవడానికి నేను ఫ్రెంచిలోను, లాటిన్‌లోను మాట్లాడలేదు. మనమాతృభాషలో మాట్లాడాను..." అన్నాడు రావు.

"అంత నీచంగానా? పాతికేళ్ళుగా సంసారం చేస్తున్న భార్యతో మాట్లాడాల్సిన మాటా అది? నీరజేమిటో ఎరుగరా మీరు?"

"అదంతా నాకనవసరం— నేను లేని సమయం లో వాడు మనింటికి రావల్సిన అవసరం ఏమిటి? నీతో మాట్లాడాల్సిన అవసరం ఏమిటి? ఆ హాస్యాలు, ఛలోక్తులు ఏమిటి? ఈ నాటకాలు ఏమిటి..."

"అతను, వాళ్ళాఫీసులో జరిగిన..." మాట్లాడ బోయిన నీరజను మధ్యలోనే అడ్డుకున్నాడు రావు" నోర్మూసుకుని లోపలికి వెళ్ళు పిచ్చి వేషాలెయ్యకు"

అమ్మ, నాన్నల మధ్య ఏదో వాగ్యుద్ధం జరుగుతున్నదని గ్రహించిన ప్రదీప్ లోపల్నుంచి తొంగి చూడటం గమనించిన నీరజ కళ్ళు అద్దుకుని, అక్కడ్నుంచి వంటగదిలోకి వెళ్ళి పోయింది గబగబ.



వాళ్ళు వచ్చేసరికి తయారు చేస్తున్న పకోడీలు ప్లేట్లో పెట్టి తెచ్చి ఇచ్చింది. అతను చాలా మొహమాటపడ్డాడు.

"తీసుకోండి ఫరవాలేదు" అని అన్నాక మెల్లగా చేతిలోకి తీసుకున్నాడు.

పనేమి లేకపోయినా స్టవ్ వెలిగించి పక్కనున్న కాగిన పాలగిన్నె మళ్ళీ పొయ్యిమీద పెట్టింది నీరజ.

అంత చిన్న కుర్రవాడితో తనకు అక్రమ సంబంధం కట్టడమా? అసలు ఈ అవకాశం

ఎందుకు రావాలి? అతను ఈ ఇంట్లో అడుగు పెట్టడానికి అవకాశం ఇచ్చిందెవరు?

అయినా తన కొడుకు ఈడు పిల్లవాడితోనా?

ఆ వేళ వినయ్‌ని ఇంట్లోకి తీసుకువచ్చి పరిచయం చేసిన రావు...

* * * * *

నీరజా! నీరజా!......

"ఓయ్ వస్తున్నానండీ!... ఏమిటి?..." అంటూ పని వదిలేసి హడావుడిగా వచ్చిన నీరజను భర్త పక్కన కొత్తవ్యక్తి ఉండడంతో వెనక్కి తగ్గింది.

"ఇతను వినయ్. మన ఎదురు ఇంట్లోకి నాలుగైదు రోజుల కిందట దిగారు, ఇంజనీర్... ఈమె మా ఆవిడ, నీరజ..." అంటూ పరస్పరం పరిచయం చేశాడు రావు.

సన్నగా, పొడుగ్గా చూడగానే ఆకర్షణీయంగా ఉన్న ఆ యువకుణ్ని చూస్తే ముచ్చటేసింది నీరజకు. పైగా పేరుకు తగిన వినయం.

రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాడు. నీరజ కూడా ఆదరంగా పలకరించి మర్యాద చేసింది.

తరువాత కాఫీ తెచ్చి ఇచ్చింది. ఇది మొదటిసారి అతనితో పరిచయం.

వినయ్ తన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఇంకా పెళ్ళికాలేదు. వంట చేసుకోవడం రాదట. హోటల్‌లో భోజనం చేస్తున్నాడు. అతనికంటే వయసులో రెండు మూడేళ్ళు తేడానేమో నీరజ పిల్లలు ప్రదీప్, ప్రమోద్‌ల ఇద్దరికీ వినయ్‌తో బాగా స్నేహం కలిసింది. సరదాగా మాట్లాడుకోవడం, ఎప్పుడైనా కలసి సినిమాలకు వెళ్ళడం జరుగుతుండేది.

ఉగాది పండుగ వచ్చింది. ఆరోజు రావు నీరజతో అన్నాడు" ఈరోజు వినయ్ కూడా మనతో పాటు భోజనం చేస్తాడు"

"ఆ దాందేముంది మన పిల్లలతో పాటు గుప్పెడు మెతుకులు తింటాడు" అంది నీరజ పులిహోరలో తిరగమోత వేసి కలుపుతూ.

వినయ్ చాలా కలుపుగోలు. భోజనం చేస్తున్నంత సేపు ఏవో జోక్స్ వేస్తూనే ఉన్నాడు. నీరజ కూడా అతణ్ని తమ కుటుంబంలో సభ్యుడిగా భావించి ఆదరించింది.

ఆ తరువాత పది రోజులకు మాటల సందర్భంలో ప్రమోద్ తన పుట్టినరోజు అనటంతే స్వీట్స్‌తోపాటు ఖరీదైన ఒక పెన్ను బహూకరించాడు వినయ్. అనుకోకుండా రావు గారి కుటుంబంతో వినయ్‌కి సాన్నిహిత్యం పెరిగింది. అలా తరచుగా అతను రావుగారింటికి రావడం



## చలాకీ జాకీ

రవీనా టాండన్‌తో జాకీష్రాఫ్ ఇచ్చిన ఈ ఫోజు చూసారు కదా! ఈ ఫోటో చూసి ఆ విధంగా నా ఎడమ ఎత్తును జాకీ ఏం చేసడోనని మానాన్న తెగ అదుర్దా పడ్డారు తెలుసా! అంటూ అమాయకంగా చెబుతోంది రవీనా.

అక్కడే కాలక్షేపం చేయడం మాట్లాడే సమయంలో భోజనం వేళైతే భోజనం చెయ్యడం మామూలైపోయింది.

ఒకరోజు వినయ్ అన్నాడు "రావుగారూ! మీ ఇంట్లో తరచు భోజనం చెయ్యాలంటే సిగ్గుగా ఉంది...."

"నీకోసం ప్రత్యేకం వండటం లేదుకదా! మాతోపాటు నువ్వు..." అన్నారు రావుగారు చాలా తేలిగ్గా.

"మీరేమి అనుకోనంటే ఒక మాట అడుగుతాను..." అన్నాడు వినయ్ సందిగ్ధంగా రావుగారు వైపు చూస్తూ.

"చెప్పండి......"

"అ... హా... ఏం లేదు రోజూ ఏదో ఒంకతో నేను మీ ఇంట్లోనే భోజనం చేస్తున్నాను. ఇట్లా ఒకటి రెండు రోజులంటే బాగుంటుంది. కానీ ఎప్పుడూ మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టంలేదు. అందుకని వీలున్నప్పుడు మీ ఇంటి భోజనం తిన్నా పేయింగ్ గెస్ట్‌గా ఉంటే బాగుంటుందేమో......"

రావు ఒక్క నిముషం పాటు ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తే ఈ పద్ధతి బాగానే ఉన్నట్లుంది. అందువల్ల తనకు నష్టంలేదు. నీరజ అతనికోసం పడే కష్టమూ లేదు. ఈ విషయంలో అందుకని ప్రత్యేకం ఆమెతో సంప్రదించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరమూలేదు.

"సరే మీ ఇష్టం!" అన్నాడు రావు. ఆ తరువాత జరిగింది నీరజతో చెప్పాడు.

ఆమె మనసులో ఏమనుకుందోగానీ పైకి మాత్రం తలవూపి ఊరుకుంది. 'మనఇంట్లో మనం ఒక పూట ఓపిక ఉన్నా లేక పోయినా ఏదో ఒకదాంతో సరిపెట్టుకుంటాం కానీ ఆలోచిస్తే ఇది కొంత ఇబ్బందికరమైన విషయమే. మగవాళ్ళకి ఆ ఇబ్బంది అంతగా పట్టదు. చెప్పడానికి ప్రయత్నిస్తే ఇంత చిన్న విషయానికి అంతరాద్ధాంతం చేసినట్లు కనిపిస్తుంది అనుకుంది.

అర్ధంగీకారమైన మౌనంతో నీరజ వంట చేయడం, అందరితోపాటు అతనూ భోజనం చెయ్యడం నెలకూ ఐదువందల చొప్పున అతను రావుగారికి డబ్బు చెల్లించి పేయింగ్ గెస్ట్‌గా చెలామణీ కావడం. ఒకదాని వెనుక ఒకటి జరిగిపోయినై.

అట్లా 6 నెలలు గడిచినై. నీరజ మొదట ఆలోచించినంతగా సమస్యలేం రాలేదు. వినయ్ కానీ, కుటుంబ సభ్యులుకానీ పూర్తిగా కలిసిపోయినారు.

అందరూ కలసి సినిమాకు వెళ్ళడం, సరదాగా అన్ని విషయాలు చర్చించుకోవడం.

నిజానికి అంతకు ముందు ఆ ఇంట్లో ఎవరి పన్లు వాళ్ళు చేసుకు పోవడమేగానీ కలిసి ఉంటం, వాతావరణంలో చైతన్యం ఉండటం జరిగేదికాదు. కానీ వినయ్ రాకతో ఇంట్లో చాలా మార్పు వచ్చింది. ఒకరకంగా చెప్పాలంటే పరస్పరం సాన్నిహిత్యం పెరిగింది.

"అబ్బ! నీరజగారూ! మీరు చేసిన వంకాయ కూర అద్భుతం మాట్లాడలేమిటి రావుగారూ!" వంకాయకూర మళ్ళీ వేయించుకుని కలుపుకుంటూ అన్నాడు వినయ్.

"ఆ ఏం వంట! నువ్వు పిచ్చి బ్రహ్మచారివి గనక వచ్చింది గానీ నిశాకమున్నా కలుపుకుని ఆరగిస్తుంటే స్వర్గానికి బెత్తెడు దూరం ఉండాలి. అబ్బ! ఏదీ... స్వర్గానికి చాలా దూరం ఉన్నాం. అందుకే అన్నారోయ్ వినయ్! నలభీమపాకమని— ఎవరూ దమయంతీ పాకమనీ, ద్రౌపది పాకమని అననిది ఎందుకనుకుంటున్నావ్!..." అని రావుగారూ బెణుకు విసిరారు.

అంతే నీరజకు చ్రుున కోపం వచ్చింది" ఇంత కష్టపడి అన్ని మసాలాలు జత చేసి ఇంతరుచిగా వండితే నన్నట్లా అంటారా? రేపటి నుంచి చూడండి— అన్ని కూరల ముఖాన ఇంత తిరగమాత పడేస్తానంతే— మీ ఇష్టం ఉంటే తినండి లేకపోతే లేదు..." రుసరుసలాడుతూ విసురుగా

అంది.

"చూశావా వినయ్! నీరజకు కోపం తెప్పించి సరదా చూడ్డం నాకు ఇష్టం. మవ్వెట్లా ఫీలయ్యావో చెప్పు..." నవ్వుతూ అన్నాడు రావు వినయ్ వైపు చూసి.

"నేనా, సినిమాల్లో రసవత్తర ఘట్టంలా..." అంటూ నవ్వేశాడు వినయ్

"ఇంతకీ కూరబాగుందోయ్ ... లేకపోతే ఇంత లాగించేస్తానా?..." రావు అన్నాడు.

"అయినా బాగుండకేం చేస్తుంది. ఎంకిపాటల్లో లాగ ఆవిడ ప్రేమంతా గుమ్మరించి వండి ఉంటారు..." వినయ్ కంది పచ్చడి వేసుకుంటూ అన్నాడు.

రోజూ యాంత్రికంగా నడిచే జీవితంలో వినయ్ రావడం ఓ మలుపు— అనుకుంది చాలా సార్లు నీరజ.

అతను తన పుట్టిన రోజువస్తే నీరజకు, రావుకు బట్టలు ఇచ్చి, ఇద్దరి కాళ్ళకు నమస్కరించాడు ఇట్లా ప్రశాంతంగా సాగిపోతున్న రావుగారింట్లో హఠాత్తుగా రావు నీరజను వేసిన ప్రశ్న పెను తుఫాను రేపింది.

అప్పటి వరకూ పువ్వులు నవ్వుతున్న అందమైన పూతోట ప్రళయం ధాటికి కంపిస్తోంది.


ఒక్కసారిగా వెన్నెల అంతరించి గాఢాంధకారం అలుముకున్నట్లుంది.

తన భర్త తనను ఏదో అనడం ఉబుసుపోక, సరదాకి అంటున్నాడు— అనుకోబోయింది నీరజ. కానీ అదే నిజమైతే ఆ వాతావరణం వేరుగా ఉండేది.

ఇంత దారుణమైన మాట విన్నాకూడా తనింకా బతికే ఉందా? అంత అభిమానం లేని వ్యక్తాతను ఏ దురాలోచనాలేని తనకు వేరే మగాడితో సంబంధం అంటగట్టినందుకు ఒళ్ళు కాల్చుకోవాలి. అప్పుడైనా ఈమలినం పోతుందా?......

వినయ్ కి జరిగిన విషయాలు తెలియవు మామూలుగా భోజనానికి వచ్చాడు. నీరజ బయటికిరాలేదు. భోజనం తరువాత వేరే కార్యక్రమం పెట్టుకున్న వినయ్ టేబుల్ మీద పెట్టి ఉన్న పదార్థాలు ప్లేటులో వడ్డించుకుని తిన్నానని పించి లేచాడు. వాతావరణంలో ఏదో అసహజత్వం స్పష్టంగా తెలుస్తోంది. ఎవరూ పలకరించలేదతణ్ని. ప్రమోద్ ఏదో పుస్తకం ముందేసుక్కూర్చున్నాడు ప్రదీప్ జాడలేదు. 'నీరజ గారు ఎక్కడైనా వెళ్ళారేమో' అనుకుని వెళ్ళిపోయాడు.

రావు చాలా ఆలస్యంగా వచ్చాడింటికి. అప్పటికి పిల్లలిద్దరూ నిద్రపోయారు. సాయంత్రం రావు నీరజ మీద వేసిన పిడుగు దెబ్బనుంచి కోలుకుని నీరజ కంటికి, మంటికి ఏక ధాటిగా ఏడుస్తూ మంచం మీద పడుకుని ఉంది. రావు వచ్చిన




అలికిడికి కొంచెం ఉలికిపడిందామె. కానీ ఆయన మొహం చూడాలంటేనే ఒక రకమైన జుగుప్స లాంటి భావం కలుగుతోంది.

"వాడికి అన్నం పెట్టావా?" అడిగాడు నీరజ నుద్దేశించి.

'వాడికి' అన్నది వినయ్ ని ఉద్దేశించి అని తెలుస్తూనే ఉంది. కానీ ఆమెకు జవాబు ఇవ్వాలనిపించలేదు, మాట్లాడలేదు......

"మాట్లాడవేం?" రెట్టించాడు రావు. నీరజ అప్పటికీ కదల్లేదు. రావు తనకేదో ఆదేశించినట్లు ఇంకారెండు మూడు సార్లు అడిగాడు.

అయినా నీరజ నుంచి సమాధానం రాలేదు. తగిలిన ఆఘాతానికి ఆమె మానసికంగా చిగురుటాకులా కంపిస్తోంది. ఆలోచనలు పరి పరి విధాల పోతున్నై. ఈ సమస్యకు పరిష్కార మేమిటో అంతుతెలీని అగాధంలా ఉంది.

తామిక్కడ నుండి వెళ్ళడం సాధ్యం కాదు. ఎందుకంటే అది తమ స్వంత ఫ్లాట్. అతనూ వెళ్ళే వీలులేదు కారణం అది అతనీ మధ్యనే కొన్నాడు. మరి ఈ అనుమానం పిశాచం వదలి తన బతుకు బాగుపడేదెట్లా?

కదలకుండా మెదలకుండా పడుకున్న నీరజను చూస్తే మరింత మండిపోతోంది రావుకు.

"ఏమే మొగుడునే వాడు మాట్లాడుతుంటే జవాబివ్వకుండా మొద్దల్లే పడుకుంటావా?..." అంటూనే నీరజ దగ్గరకొచ్చి జుట్టుపట్టుకుని లేపి చెంపపగిలేలా ఒక్కటి కొట్టాడు.

అనుకొని ఈ పరిణామానికి దిమ్మెరపోయింది నీరజ. జుట్టు విడిపించుకునే ప్రయత్నం చేస్తే ఒక్కతోపు తోశాడు. వెళ్ళి గోడకు కొట్టుకుని తలబొప్పికట్టింది. అయినా నీరజ మాట్లాడ దల్చుకోలేదు. 'వాడికీ, నీకూ మాటలేంటే? ఎన్నాళ్ళ నుంచి సాగుతోందిది' లాంటి పచ్చి మాటలు నోటికి వచ్చినట్లు మాట్లాడాడు రావు. ఎదిగిన పిల్లలున్న తనను ఆ విధంగా అంటున్న రావును, తనను విశ్వసించని భర్తను గురించి ఏమనుకోవాలో కూడా అర్థం కాక ప్రాన్పడిపోయిం దామె.

నీరజకు తెల్లవార కూడదనిపించింది. ఇంత హీనమైన పరిస్థితి ఏ ఆడదానికి రాకూడనిపిస్తోంది. తెల్లవారితే వంట చెయ్యాలి. వినయ్ కి భోజనం పెట్టాలి. ఎట్లా అతణ్ని ఎదుర్కోవడం?

వెక్కిళ్ళ మధ్యే తెల్లవారి పోయింది బాగా జ్వరం వచ్చేసింది. రావు లేచి వెళ్ళిపోయినాడు. 9 గం.కు ఇంట్లోకి వచ్చిన వినయ్ కి 'అమ్మకి జ్వరం వచ్చింది' అని ప్రదీప్ చెప్పడం వింది నీరజ.

"అరే, జ్వరం వచ్చిందా? ఏరి మీ అమ్మ" అంటూ అతను లోపలికి వచ్చేశాడు. వచ్చి మంచం దగ్గర నుంచున్నాడు. నీరజ అటు తిరగి కదలకుండా పడుకుంది. ఒక్క నిముషం నుంచుని, వినయ్ వెళ్ళి పోయిన అలికిడి వింది "అమ్మయ్య' అని ఒకసారి నిట్టూర్చింది.

కాని, 10 నిమిషాల తరువాత డాక్టర్ని వెంటబెట్టుకు వచ్చాడు వినయ్ బిక్కచచ్చి పోయింది నీరజ.

డాక్టరు పరీక్షించి మందులు రాసి చీటి వినయ్ కి ఇచ్చాడు. ఫీజు ఇచ్చి డాక్టర్ని సాగనంపి మందులు, బ్రెడ్, పండ్లు కొనుక్కొని వచ్చి ఇచ్చి జాగ్రత్తగా వేసుకోమని చెప్పి వెళ్ళిపోయాడు.

ఇదంతా నిముషాల మీద జరిగిపోయింది. రావు తిరిగి వస్తే ఎంత రాద్ధాంతం జరుగుతుందో— వినయ్ డాక్టర్ని తీసుకురావడం, మందులు, పళ్ళు తేవడం, ఇది రావు అంత తేలిగ్గా తీసుకుంటాడా? నమ్మకం లేదు పిచ్చిపట్టినట్లుంది.

ప్రదీప్, ప్రమోద్ లకు పూర్తిగా కాకపోయినా తల్లి సమస్య అర్థమైంది. వాళ్ళు కూడా స్తబ్ధంగా అయినారు.

సాయంత్రం వినయ్ ఆఫీసు నుంచి రాగానే నీరజ ఎట్లాఉందో చూడాలన్న ఉద్దేశంతో వాళ్ళింట్లోకి రాబోయినాడు.



(ముగింపు వచ్చేవారం)